10

# జారుడుమెట్లు

అది యమునా తీరం కాదు. వీస్తున్నది మలయ సమీరం కాదు. ఎయిర్ కండిషనర్ పంపుతున్న చల్లగాలికి పరవశిస్తూ, ఆ రెస్టారెంటులో ఓ మూల కూచుని, ఆ మసక మసక చీకట్లో, గుడ్డి వెలుతురులో ఆరు గంటలకి వస్తానన్న జాహ్నవి కోసం ఎదురు చూస్తున్నాడు ఆర్య.

వందోసారి వాచి చూస్తూండగా, ఆరు గంటల ఐదు నిమిషాలకి, జాహ్నవి వచ్చింది. ఆమెతోపాటు ఓ పరిమళాన్ని మోసుకొచ్చింది. తన హాండ్‌బ్యాగ్‌ని మౌనంగా టేబుల్ మీద పెట్టి, ఆర్య ఎదురుగా కూచుంది.

ఆమెని చూసి, సంతోషంగా, పెదవులు విడకుండానే నవ్వి, చేత్తో వెయిటర్‌ని రమ్మని సైగ చేశాడు.

"ఏమైనా తిందామా!" అంటూ ఆమె మొహంలోకి చూశాడు.

"ఏం వొద్దు. కాఫీ చాలు..."

"రెండు కాఫీ" అని చెప్పి జాహ్నవిని చూశాడు ఆర్య.

ఆమె ఎడం చేత్తో ముక్కూ, మూతి, గడ్డం తుడుచుకుంటోంది.

"ఏం, అలా ఉన్నావ్? ఒంట్లో బాగా లేదా!" ఇంగ్లీషులో అడిగాడు.

తల వొంచుకుని కాదన్నట్లుగా తల అడ్డంగా ఊపింది.

ఏం అడగడానికి ధైర్యం చాల్లేదు. రెండు మోచేతులు టేబుల్‌పై ఉంచి, ముందుకి వంగాడు.

కాఫీ వచ్చింది. ఓ కప్పు ఆమె ముందుకి జరిపి, తనోటి తీసుకున్నాడు. ముక్కు ఎగబీలుస్తూనే కప్పుని పట్టుకుంది.

"జలుబు చేసిందా?" చాలా మృదువుగా అడిగాడు.

కాదన్నట్లుగా తలూపింది.

కప్పుని టేబుల్‌పై నుంచి, కుడి చేత్తో, ఆమె గడ్డం పట్టుకుని ఎత్తాడు. ఆమె కళ్ళ నిండా నీళ్ళు.

"ఏం జరిగింది? ఆ నీళ్ళేంవిటి? ఎవరైనా ఏంవైనా అన్నారా?..."

పెదిమలు బిగపెట్టి, కాదన్నట్లుగా తలూపింది.

"కాదు, జాహ్నవీ – ఏదో జరిగింది? ఏం జరక్కపోతే అలా ఎందుకుంటావ్? ఏదో జరిగింది... నువ్వు చెప్పడం లేదు. ఏం లేదని తల అడ్డంగా ఊపేస్తే నేన్నమ్మను..."

కప్పుని పక్కన పెట్టి, బాగ్ తెరిచి, అందులోంచి, ఓ చిన్న అద్దం తీసి, కళ్ళ కిందకి జారిన నీటి బొట్లని, దానితోపాటు వచ్చిన నల్లరంగుని, జాగ్రత్తగా కుడి చూపుడు వేలుతో తుడిచింది. మళ్ళీ అద్దం బ్యాగ్‌లో పెట్టి, కప్పు తీసుకుంది.

ఆమె ప్రతీ కదలికను గమనిస్తున్నాడు. ప్రశ్నార్థకంగా ఆమెనే చూస్తూ ఆమె కుడిచేతిని, కప్పుతోపాటూ, ముందుకి మెల్లగా లాగాడు. ఆ కప్పుని పక్కకి పెట్టి, తన ఎడమ చేయిని, ఆమె చేతిమీద వేశాడు.

"నా దగ్గర కూడా దాస్తావా? ఏం జరిగింది. నాక్కూడా చెప్పవా?" లాలనగా అడిగాడు.

ఆమె, ఓసారి ఆర్య మొహంలోకి చూసి, గొంతు సవరించుకుంది.

"నిన్నటివరకు నిన్ను ప్రేమిస్తున్నానేమో అన్న అనుమానం ఉండేది. కానీ, అది వొట్టి అనుమానం కాదు నిజం. నిజంగానే నేను నిన్ను ప్రేమిస్తున్నాను..."

ఆర్య తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. హమ్మయ్య. తను చెప్పాలనుకుంటున్నది ఆమే చెప్పేసింది.

జాహ్నవి, మళ్ళీ ఓసారి ముక్కు, నోరు, గడ్డం తుడుచుకుంటూ ఆర్యని చూసి పేలవంగా నవ్వింది.

"చిన్న పిల్లలా ప్రవర్తించాను. కదా!" అంటూ చూసి, "నేను చేస్తున్నది తప్పని తెలుసు. నువ్వు పెళ్ళయినవాడివని తెలిసీ కూడా... ఏంవిటో జరిగిపోయింది. నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను. సారీ..." అంది.

ఆర్య కళ్ళు మెరిశాయి... "జాహ్నవీ!" అని మాత్రం అనగలిగాడు.

"జరగని వాటి గురించి ఆలోచించడం మంచిది కాదు. నిన్ను పెళ్ళి చేసుకునే హక్కు నాకు లేదు. ఇప్పుడు నేను సరిగ్గా ఆలోచించి అడుగు వెయ్యాలి... ఇంక మనిద్దరం కలుసుకోకపోవడమే మంచిదని నా కనిపిస్తోంది..." అంటూ లేచింది. వెంటనే ఆమె రుమాలు కిందపడింది. దెబ్బతిన్నట్లు, బాధగా చూశాడు.

ఆమె రుమాలు తీసుకోవడానికి వంగింది. ఆర్య కూడా ఎడమవైపు వంగి, రుమాలుతో సహా, ఆమె చేతిని పట్టుకున్నాడు.

ఆమె తన చేతిని లాక్కుంటూనే, నిటారుగా నుంచుంది.

"ఓ ఏడాది నుంచి ఇద్దరం ఒకే కంపెనీలో పనిచేస్తున్నాం. ఇద్దరి డిపార్ట్‌మెంట్లు ఒకటి కాకపోయినా, ఒకే బస్సులో, ఒకే స్టాపులో ఎక్కుతున్నాం. దిగుతున్నాం. ఎన్నోసార్లు కలుసుకున్నాం. ఎన్నో మాట్లాడుకున్నాం. నేను కూడా నిన్ను ప్రేమిస్తున్నాను. రాత్రింబవళ్ళూ నీ గురించే ఆలోచన..."

"నిజంగా..." కనుబొమలు ఎగరేస్తూ పెదిమ విరిచింది.

అవునన్నట్లుగా రెప్పలు మూసి, తల ఊపాడు.

"అయినా కూడా మనం ఇక్కడితో ఆగిపోదాం... నీకు పెళ్ళయిందన్న సంగతి మొదట తెలీదు. తెలిసి ఉంటే..." ఆగిపోయింది.

"ఇప్పుడయినా ఏం ఫర్వాలేదు... అసలు.. నీకో విషయం చెప్పాలి... నీతో మాట్లాడుతూంటే, నాకు పెళ్ళయిందన్న విషయం గుర్తుకు రావడం లేదు. నువ్వు

నాకు దూరం అవుతావు అన్న ఆలోచనని నేను భరించలేను... జాహ్నవీ, నీ కోసం నేనేఁవయినా చేస్తాను. నాకు పెళ్ళయితేనేం - నేను పెళ్ళయిన వాడినయితేనేం, నేను మానేజ్ చేయగలను, జాహ్నవీ! నువ్వు నాక్కావాలి - నీ కోసం నేనేఁవయినా చేస్తాను..." ఆవేశంగా ఆమె చేతిని ఊపుతూ అన్నాడు.

తడి ఆరని కళ్ళతో ఆర్యని చూసింది జాహ్నవి ఆశ్చర్యంగా.

"బాగా ఆలోచించుకో" చరచరా నడిచి వెళ్ళిపోయింది.

ఏం చేయాలో అర్థంకాక, జుట్టులో వేళ్ళని దూర్చి చాలాసేపు అలాగే కూచుండిపోయాడు. ఆ తర్వాత పక్కనే ఉన్న బార్‌లోకి వెళ్ళాడు.

పదకొండు గంటలకి ఇల్లు చేరిన ఆర్యని పరిశీలనగా చూసింది భార్య మానస.

తలుపు వేసి ఆర్య వెనకాలే నడుస్తూ అంది.

"ఎన్నిసార్లు ఫోన్ చేసినా, స్విచ్‌డాఫ్ అని వస్తూంటే చాలా కంగారుపడ్డాను. ఎక్కడున్నారు? అసలు సెల్ ఎందుకు ఆఫ్ చేయాల్సొచ్చింది? ఎక్కడికెళ్ళారు? ఎంత కంగారు పడ్డానో?"

ఆమెను చూస్తూంటే, ఆమె మాటలు వింటూంటే కంపరం ఎత్తింది. చటుక్కున వెనక్కి తిరిగి ఆమెకి దగ్గరగా మొహం పెట్టాడు.

"కంగారా! కంగారు దేనికి? పిల్లెత్తుకుపోయిందనుకున్నావా? లేకపోతే ఏదో యాక్సిడెంటయిపోయిందనుకున్నావా?" అరిచినట్లుగా అన్నాడు.

ఆమె బిత్తరపోయింది ఆ మాటలకి.

"ఛ... ఛ... అంత విపరీతార్థం ఎందుకు తీస్తారు; ఫోన్ తియ్యకపోతే, మనసు పరిపరివిధాలా..." చాలా మెల్లగా అంది.

"పోయిందా!... పోనీ వెధవ మనసు- నాతో మాట్లాడకు. నన్ను విసిగించకు" అంటూ గది వైపు కదిలాడు.

కడుపులోంచి అలలు ఒక్కసారి ఎగసి, గుండెని ముంచేసి, మోయలేని బరువుని ఇచ్చేస్తే, అక్కడే ఉన్న డైనింగ్ కుర్చీలో కూచుండి పోయింది. కళ్ళల్లోంచి నీటి బొట్లు జారాయి. తుడుచుకోవడానికి ప్రయత్నించలేదు.

టేబుల్ పైన గిన్నెలుంటే కొన్నింటిని ఫ్రిజ్‌లో, కొన్నింటిని టేబుల్‌పైన ఓ మూల ఉంచింది. బోర్లించిన రెండు కంచాల్లో ఒకటి తీసేసింది.

అప్పుడే గదిలోంచి బయటికి వచ్చి మానస దగ్గరగా నుంచున్నాడు. వెంటనే ఆమె లేచింది.

"వండినవాటిల్లో కొన్ని ఫ్రిజ్‌లో, కొన్ని టేబుల్ మీద ఉన్నాయి. తినాలనిపిస్తే తినండి..." అంటూ కదిలింది అక్కడి నుంచి.

"ఆగు...." కర్కశంగా అన్నాడు.

చివ్వున వెనక్కి తిరిగింది. కత్తిరించిన పొట్టి జుట్టు, విసురుగా మొహం మీద, మెడమీద పడి, ఫాన్ గాలికి మొహం మీద ముసిరింది. ఆ నల్లటి వెంట్రుకల తెరల మధ్య తెల్లటి నుదురు, పావలా కాసంత ఎర్రటి బొట్టు.

ఆర్య కళ్ళకి ఆమె ఓ అమ్మవారిలా కనిపించింది. వెంటనే జాహ్నవి కళ్ళ ముందు కనపడింది. ఈ మానస మూలంగా రేపట్నించి జాహ్నవిని కలవడం కుదరదన్న ఆలోచన పిచ్చి పట్టిస్తోంది. ఏం చేయాలో తెలీలేదు. పీక పిసికి చంపేయా లన్నంత కోపం వచ్చింది.

"మానసా! ఆడదానికి అందం ఒక్కటే చాలదు. మొగుణ్ణి సంతోషపెట్టడం రావాలి. అది నీకు లేదు..." పెద్ద పెద్దగా చెప్పుల శబ్దం చేస్తూ వెళ్ళిపోయాడు.

బొమ్మలా నుంచుండి పోయింది.

ఆ స్టేట్‌మెంట్ తప్పని ఇద్దరికీ తెలుసు. బోహీమియన్ నడవడి, లైఫ్ స్టైల్ ఉన్న ఆర్య మారాడని అనుకుంది మానస. కానీ కాదు అని తెలుసుకుంది. మానస తర్వాత మరో అమ్మాయి చూడకూడదని అనుకున్నాడు కానీ, జాహ్నవిని చూశాకా, పరిచయం పెరిగాకా, జాహ్నవి లేకుండా బతకడం కష్టం అని అనిపించింది.

మానస కదిలి, గదిలోకి వెళ్ళిపోయింది.

కాస్సేపయ్యాక ఆర్య గదిలోకి వచ్చాడు.

గోడవైపు తిరిగి పడుకున్న ఆమె, భర్త కదలికలు వినిపిస్తున్నాయి. ఆ కదలికల్ని విజువలైజ్ చేసుకుంటోంది.

"ఎవర్నైనా ప్రేమించావా?" తల తిప్పకుండానే అడిగింది.

నైట్ డ్రెస్ తీసుకోబోతున్న ఆర్య ఉలిక్కిపడ్డాడు. పట్టుబడ్డట్టుగా అనిపించింది. అంత తొందరగా ఆమె కనిపెట్టేస్తుందని అనుకోలేదు.

"అవును. ప్రేమించాను. ఎనీ ప్రాబ్లెం? చెప్పు ఏదైనా ప్రాబ్లమా! చెప్పు. ప్రేమించాను. ఏం చేస్తావ్? ఏం చేయగలవ్? చెప్పు ఏం చేస్తావ్? విడాకులిస్తావా? ఇయ్యి... విడాకులియ్యగలవా!" తల ఎగరేస్తూ, ప్రతీ మాటకు ఒక్కొక్క అడుగు వేస్తూ చేతులు, వేళ్ళు కదిలిస్తూ మంచం అంచువరకు వచ్చాడు.

మానస ఒక్కసారి భయపడింది. ఆ గొంతులోని మార్పు చూసి.

"నన్ను ప్రేమించానన్నావ్ కదా! అది నిజం కాదా!"

"మాటకి మాట బాగా చెప్తున్నావ్! నీది డబ్బున్న గర్వం. గర్వం ఉన్న ఆడదాన్ని ఏ మొగుడూ ఇష్టపడడు..." అంటూ వెళ్ళిపోయాడు.

ఏం తినాలనిపించలేదు. మంచినీళ్ళు కూడా తాగకుండా రెండు నిద్రమాత్రలు వేసుకుని, ముందుగదిలోని సోఫాలో పడుకున్నాడు.

మొహం మీద వెచ్చటి ఎండపడుతూంటే మెలకువ వచ్చింది. మత్తుగా గోడ గడియారం కేసి చూశాడు. ఏడున్నర దాటింది. టాబ్లెట్లు బాగా పనిచేశాయి. హాయిగా అనిపించింది. రిలాక్స్‌డ్‌గా ఉంది.

కంపెనీ బస్సు వెళ్ళిపోతుంది. కారులో వెళ్ళచ్చులే అని అనుకుంటూనే బాత్రూంలోకి వెళ్ళాడు.

ఇల్లు నిశ్శబ్దంగా ఉంటే, మానస కోసం అటూ ఇటూ చూశాడు. కనపళ్ళేదు. ఏదో ఓ మూల కూచుని ఏడుస్తోందేమో! ఏడవనీ-

వంటింట్లోకి వెళ్ళాడు.

గ్యాస్ పక్కన ఓ ప్లేటులో బిస్కట్లు, ఓ గ్లాసులో జ్యూస్, మరో గ్లాసులో పాలు మూతలు పెట్టి ఉన్నాయి. పాలగ్లాసు కింద ఓ తెల్లకాయితం కదులుతోంది. తీసి చదవడం మొదలు పెట్టాడు...

"…. నీ పేరు రాయడానికి చేయి రావడం లేదు. రాత్రి నన్ను చాలా హర్ట్ చేశావు. చాలా అనాగరికంగా ప్రవర్తించావు. నీ చదువు నీ కివ్వాల్సిన సంస్కారాన్ని ఇవ్వలేదు. నువ్వు కంఫర్ట్ జోన్‌లో ఉండడానికి ఏంవైనా చేస్తావు. సెల్ఫిష్ ఫెలోవి. పెళ్ళి చేసుకున్నప్పుడు కమిట్‌మెంట్ కూడా ఉండాలి. నీ కది లేదు. కమిట్‌మెంట్ లేని పెళ్ళికి విలువ లేదు. అర్థం లేదు. అర్థం లేని పెళ్ళితో మనం కలిసి ఉండాల్సిన పని లేదు. విడాకులు కావాలనుకుంటున్నావు. అదెంత సేపు. ఇస్తాను.

మానస."

విడాకులు కోరుకుంటున్న మాట నిజమే. కానీ, ఏం పెద్ద దెబ్బలాటల్లేకుండా విడాకులు తీసుకోవడం బావుంటుందా! మనసులో ఎక్కడో అవమానంగా అనిపించింది. ఏమీ తినాలని, తాగాలని అనిపించలేదు.

తాళాలు పెద్దగా వెతకక్కర్లేకుండానే టీవి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో కనిపించాయి.

బయటికొస్తూంటే జాహ్నవి గుర్తొచ్చి, కారులో కూచున్నాక ఫోన్ చేశాడు.

చాలా సేపటికి జాహ్నవి సెల్ తీసింది.

"నేనే నీకు చేద్దామని అనుకుంటున్నాను. నిన్న సాయంత్రం నా ప్రవర్తన.. ఏం బాగాలేదు… ఎందుకలా గబగబా వచ్చేశానో నాకే తెలీదు సారీ…"

నవ్వాడు… మనసంతా తేలికయింది.

"ప్రేమలో క్షమార్పణలుండకూడదు. గుర్తుపెట్టుకో… ఇంకో విషయం నా విషయం నా భార్యకి తెలిసిపోయింది…"

"అరెరె… ఏమైంది?" ఆర్య మాటలు పూర్తికాకుండానే గబుక్కున అడిగింది.

"ఆమె ఏంవంటుందని ఊహిస్తావ్?…"

"సారీ, ఆర్యా! నేను జవాబిచ్చే స్థితిలో లేను. తొందరలో ఉన్నాను."

"ఓ.కే. నేనే చెప్తాను. మానసకి పూర్తిగా ఏమీ తెలియకపోయినా, గ్రహించింది. తొందరగా రియాక్ట్ అయింది. డైవోర్స్ ఇవ్వడానికి రెడీ అయిపోయింది. ఆమె నుంచి మనకేమీ అడ్డులేదు. ఇంక నీకు అభ్యంతరాలేమీ ఉండవనుకుంటాను…"

ఒక సెకండ్ మౌనం... "నిజమా!" అంది.

"అబద్ధం చెప్పాల్సిన పనేంవుంది?" అంటూ కారు స్టార్ట్ చేశాడు.

మళ్ళీ మౌనం.

"తను.. అంటే అదే, నీ భార్య మనసు మార్చుకోదన్న నమ్మకం నీకుందా?"

కుడిచేత్తో స్టీరింగ్ తిప్పుతూ, ఎడంచేతిలో సెల్‌లో మాట్లాడుతూ వెళ్తున్నాడు.

"అఫ్‌కోర్స్ – ఆమె సంగతి నాకు బాగా తెలుసు. మాట్లాడుతూ కారు నడపడం చాలా కష్టంగా ఉంది. ఓ పనిచెయ్యి జాహ్నవీ, నిన్న సరిగ్గా మాట్లాడుకోలేదు. ఇన్‌కంప్లీట్‌గా లేదా నిన్నటి మీటింగ్! ఇవాళ అలా కాకుండా చాలా మాట్లాడుకోవాలి. ఆఫీస్ నుంచి వచ్చేటప్పుడు బేగంపేటలో దిగుదాం. ఏంటి? ఆఫీసులో లేవా! ఆఫీసుకి వెళ్ళలేదా? ఏం? ఎందుకు? అరే... ఒకే... ఇంట్లోనే వున్నావు కాబట్టి, డైరెక్టుగా నిన్న మనం కూచున్న ప్లేస్‌కే వచ్చెయ్యి..."

ఆమె ఏం అందో వినపళ్లేదు. బయట అంత ట్రాఫిక్ ధ్వనులు. సాయంత్రం ఆరు అవుతూండగా రెస్టారెంట్ కెళ్ళి ఓ మూల కూచున్నాడు– మసక చీకట్లో, గుడ్డి వెలుగులో రాధ కోసం ఎదురుచూస్తున్న కృష్ణుడిలా.

ఆరున్నరయినా రాలేదు. రెండుసార్లు ఆమెకి ఫోన్ చేశాడు. రెస్పాన్స్ లేదు.

ఏం జరిగి ఉంటుందో ఊహించడానికే భయం వేసింది. ఓ అరగంట వరకూ ఫోన్ చేస్తూనే ఉన్నాడు. ఇల్లు తెలీదు. అసలు ఆమె ఎక్కడ ఉంటుందో కూడా తెలీదు. బస్టాప్ ఇద్దరిదీ ఒకటే అయినా, ఆమె ఆటోలో స్టాప్‌కొస్తుంది. తనకి పెళ్ళయింది అన్న ఆలోచనలోనే ఉండడంవల్ల, ఆమె ఎక్కడుంటుందో అడిగితే చీప్ అయిపోతాడేమో అన్న ఆలోచన కూడా ఉండడం వల్ల, ఆమె పర్సనల్ విషయాలు అడగలేదు.

ఏం చేయాలో తెలీక, ఎక్కడ ఆమెని వెతకాలో, ఎలా కాంటాక్ట్ చేయాలో అర్థం కాక, నీరసంగా ఇంటికి వెళ్ళాడు.

ఫ్లాట్ ముందు ఎప్పుడూ వెలిగే దీపం వెలగడం లేదు.

అప్పుడు గుర్తొచ్చింది. మానస ఇంట్లో లేదన్న సంగతి. తాళం చేతుల కోసం ఓ రెండు నిమిషాలు వెదికాక, అవి దొరికాక, తాళం తీసి ఇంట్లోకి అడుగు పెట్టాడు.

చీకటి. నిశ్శబ్దం. ఓ మనిషి అలికిడి లేకుండా, లేటైనా లేకుండా, ఎందుకో ఓ క్షణం భయంగా అనిపించింది.

లైటర్ తీసి వెలిగించాడు. ఆ వెలుగులో లైటు స్విచ్ వేశాడు. ఫాన్ కూడా వేసుకుని సోఫాలో కూచుని తల వెనక్కి వాల్చి, కళ్ళు మూసుకున్నాడు. ఓ పావుగంట తర్వాత, మనసు కొంచెం అదుపులోకి వచ్చాక, తలని మామూలు పొజిషన్‌లోకి తెచ్చి, టీవీ ఆన్ చేయడానికి లేవబోతూంటే నేల మీద ఉన్న ఓ తెల్ల కవరు కనపడింది.

దాని తలుపు కింద నుంచి తోయడం వల్ల ఓ పక్కగా ఉంది. ఆ కవర్ని వంగి తీసుకుని ఇటూ, అటూ తిప్పాడు. ఆ కవరుమీద అతని పేరే ఉంది. లోపలున్న కాయితం తీసి చదవసాగాడు.

ఆర్యా,

ఈ ఉత్తరం నీ చేతికి వచ్చే సమయానికి నేను ఈ ఊళ్ళో ఉండను. ఏ ఊరు వెళ్తున్నానో, ఎందుకెళ్తున్నానో, అసలు నీకు ఎందుకు చెప్పడం లేదో, ఈ వివరాలన్నీ తెలుసుకోవడానికన్నా ముందుగా ఒక్కసారి అంతకు ముందు జరిగినది, నన్ను వెంటాడుతున్న గతం ఓసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

పదేళ్ళ క్రితం, నేను పదో క్లాసులో ఉన్నప్పుడు, మా స్కూల్లో లెక్కలు, ఫిజిక్స్ చెప్పడానికి ఓ ఇంజనీరు వచ్చాడు. ఉద్యోగం దొరకలేదని, టెంపరరీగా ఓ ఆర్నెల్ల కోసం, కేవలం లెక్కలు ఫిజిక్స్ చెప్పడం కోసమే అతన్ని తీసుకున్నామని హెడ్‌మాస్టర్ అన్నారు.

ఆ లెక్కల టీచర్ ఆ మాటా ఈ మాటా చెప్పి, లెక్కలు ఈజీ మెథడ్‌లో చెప్తానని అంటూ నాతో చనువు పెంచుకున్నాడు. అతని గదిలోకి రప్పించుకునేవాడు. ఆ గదిలో మేమిద్దరమే ఉండేవాళ్ళం. అదో అందమైన ప్రపంచం. మత్తు ఆవహించే గది.

పరీక్షలు అయిపోయాయి. ఆ ఇంజనీరు వెళ్ళిపోయాడు. రిజల్ట్సు వచ్చాయి. స్కూలు ఫస్ట్ వచ్చాను. కానీ, యౌవన దశలో తప్పటడుగు వేసి ఫెయిలయ్యాను. ఫలితంగా జీవితంలో, శరీరంలో మార్పులు, సంఘం ఆమోదించని మార్పులు.

ఇంట్లో తెలిసింది. స్కూలు కెళ్ళాం. హెడ్‌మాస్టర్ ఆ ఇంజనీరు అడ్రస్ ఇచ్చాడు. అది హైదరాబాద్ అడ్రస్సు. మాకు హైదరాబాద్ దూరం. నేను, మా నాన్న రైలెక్కి ఆ

టీచర్ ఇంటి కెళ్ళాం. కొంచెం వెతుక్కున్నా కనుక్కోగలిగాం. జరిగినది, నా విషయం, నాన్న వాళ్ళతో చెప్పాడు.

"నాకేం తెలీదు, అది నీ ప్రాబ్లం అన్నాడు". నాన్న కాళ్ళా వేళ్ళా పడి బతిమాలాడు. ప్రాధేయపడ్డాడు. నేనూ ఏడ్చాను. పోలీసులకి అతని గురించి చెప్పాలని మాకు తెలీదు. మహిళా సంఘాల సాయం కోరాలని తెలీదు. గుడారం వేసి ధర్నా చేయాలని తెలీదు. ఈ ఆంధ్రదేశంలోని ఓ మూల జిల్లాలోంచి వచ్చిన వాళ్ళం. ఊరికి తిరిగి వెళ్ళడానికి ధైర్యం చాల్లేదు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్ చేయించడానికి వెళ్ళాం. నాన్న నన్ను అక్కడ ఉంచేసి వెళ్ళిపోయాడు. డబ్బు తెస్తానని. కానీ, నాన్న రాలేదు. డబ్బు తేలేదు. నా సంగతి ఓ దంపతులకి చెప్పింది ఆ డాక్టర్. వాళ్ళు నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళారు.

ఓ వారం రోజులు అయ్యాక నేను ఇంటికి ఉత్తరం రాశాను. జవాబు లేదు. అమ్మ వాళ్ళకి ఫోన్ లేదు కాబట్టి పక్కనున్న దుకాణంలోకి ఫోన్ చేసినా మాట్లాడటానికి ఇష్టపడలేదు. నన్ను వదిలేశారని నా కర్థం అయింది.

ఆ దంపతులకి పిల్లల్లేరు. పెద్ద డబ్బు కూడా లేదు. అయినా నన్ను, నా కడుపులో ఉన్న జీవిని ఆహ్వానించారు. ఈ ప్రపంచం, నా తల్లిదండ్రులతో సహా ఇవ్వడానికి నిరాకరించిన ప్రేమని వాళ్ళిచ్చారు.

ఆ ఇంజనీరువి నువ్వే. ఎప్పుడైనా జరిగింది నీకు గుర్తుందా? ఏ క్షణాన్నయినా, నా కళ్ళల్లోని నీళ్ళు కానీ, మా నాన్న దీనాతిదీనమైన మొహం కాని గుర్తుకొచ్చిందా? పోనీ ప్రయత్నించావా గుర్తు తెచ్చుకోవడానికి! ఆ పదిహేనేళ్ళ గర్భిణి పిల్ల గతి ఏమయి ఉంటుందో అన్నదైనా కనీసం గుర్తుందా?

ఊహూం నువ్వు ఆలోచించి ఉండవు. విలువ ఇవ్వని దాని గురించి ఆలోచనెందుకని అనుకుని ఉంటావు. స్కూలు, ఇల్లు తప్ప మరోటి నాకు తెలీదు. పసిమొగ్గలాంటి వయసులోనే భయంకరమైన జీవితాన్ని చూపించావు.

తప్పు జరిగింది. దానికి నేను ఒక్కదాన్నే బాధ్యురాల్ని కాదు. అమాయక వయసులో జరిగినది తప్పు కాదని నన్ను పెంచిన ఆ ముసలి దంపతులు రోజూ ధైర్యం చెప్పేవారు. ఆ ధైర్యం రోజు రోజుకి నన్ను ఓ అడుగు ముందుకు వేయించేది.

ఓ బాబు పుట్టాడు. ఆ దంపతులు మా ఇద్దర్నీ పెంచారు. నన్ను ఇంటర్‌లో చేర్పించారు. పదో క్లాసు వరకు చదివింది, ఓ మారుమూల జిల్లాలో. వెనకపడ్డ కులం. ఆడపిల్లని, మంచి మార్కులు. అన్నీ కలిపి చూసిన కాలేజీ వాళ్ళు ఎక్కువ జీతం తీసుకోకుండానే నా చదువుకి తోడ్పడ్డారు. మంచి మార్కులు వచ్చాయి. మంచి ఇంజనీరింగ్ కాలేజీలో సీటొచ్చింది.

ఇంజనీరింగ్‌లో ఉండగానే ఉద్యోగం వచ్చింది.

ఉద్యోగంలో చేరిన ఏడాదికే నన్ను యూఎస్ పంపారు. రెండేళ్ళు అక్కడ ఉండి వచ్చాను. ఆ తర్వాత నా అప్రైజల్ రిపోర్ట్స్ బావుండడం వల్ల జీతం బాగా పెరిగింది.

ఏడాదికి నాకు పది లక్షల జీతం. అదే పల్లెటూరులోని అమ్మా నాన్న తమ్ముడిని నా వైపుకి లాగింది. వాళ్ళు కూడా మామూలు, నీలాంటి మనుషులే. పదిహేనేళ్ళ పిల్లని, ఆసుపత్రిలో పడేశాను ఏంవయిందని కానీ, అసలుందో, లేదో, చచ్చిందో బతికే ఉందో అని ఒక్కసారి కూడా చూడ్డానికి రాలేదు. కానీ ఏం చేస్తాను పరిస్థితులు నాకు నేర్పిన పాఠాలు నన్ను మానసికంగా ఎదగడానికి తోడ్పడ్డాయి. అందుకే వాళ్ళని నేనే వెళ్ళి తీసుకొచ్చాను.

నా జీవితం ఇప్పుడు బాబు చుట్టూ ఉంది. ఓ మంచి స్కూల్లో, మంచిగా చదువుకుంటున్నాడు. తండ్రి లేడని వాడి స్కూలు అప్లికేషన్ ఫారంలో రాశాను. ఇల్లీగల్ ఛైల్డ్ అన్నది ఎవరికీ తెలీకూడదనే అలా చేశాను.

హైదరాబాద్‌లోని మరో కంపెనీలోకి మారాక, బస్టాప్‌లో నిన్ను చూసి నేను గుర్తుపట్టాను. పాఠం చెప్పేటప్పుడు నీ మొహం రోజూ చూసేదాన్ని కదా, పైగా నువ్వు చేసిన దానికి, నిన్ను, నీ మొహాన్ని ఎలా మర్చిపోగలను? మర్చిపోతే, నన్ను నేను మర్చిపోయినట్లే కదా?

ఆశ్చర్యం ఏవిటంటే, నువ్వు నన్ను గుర్తుపట్టలేదు. ఓ పదిహేనేళ్ళ అమ్మాయి ఇరవయ్యారేళ్ళమ్మాయిగా మారేలోగా, ఎన్నో మార్పులు, శారీరకంగా, మానసికంగా, విద్యాపరంగా, ఆర్థికపరంగా, సామాజికపరంగా – అన్నింటికి మించి నా వస్త్రధారణ.

నిన్ను గుర్తుపట్టాక నీ గురించి తెలుసుకున్నాను. ఏడాది క్రితం పెళ్ళయిందని తెలిసింది. మనిద్దరి యూనిట్‌లు, బిల్డింగ్‌లు వేరయినా కూడా బస్టాపులో నన్ను చూసే తీరు అది గమనించాకా నువ్వు మారలేదని గ్రహించాను. నీ జీవితం పాడు చేయాలన్న ఉద్దేశంతోనే నీతో మాట్లాడాను. నీ గుణాలు ఎలాంటివో నీ భార్యకి తెలియాలి. ఆమెను బాధ పెడ్తున్నానని తెలుసు. కానీ, తప్పదు. అందుకే ఈ ఉత్తరం జిరాక్స్ చేసి ఆమెకి కూడా పంపాను. ఆమె అడ్రసు ఎలా తెలుసుకున్నానో నీ కనవసరం.

ఇంతవరకు, నన్ను మర్చిపోయినా, నేనెవరో, ఏ జిల్లాలో పరిచయమో నీకు గుర్తు లేకపోయినా, ఇప్పుడు మాత్రం మర్చిపోవులే. అన్నట్లు నా పేరు జాహ్నవి కాదు. స్కూలు రికార్డులో, ఆఫీసులో నా పేరు వేరే. ఏ పేరయితేనేం. మనిషినే గుర్తుపట్టలేదు పేరేం గుర్తుంటుందిలే. ఇంక ఇప్పట్నించీ నీ జీవితం పాకుడురాళ్ళే. జారడం ఒకటే నీకు మిగిలేది. నీ సంగతి తెలిసిందంటే, మోరల్ వాల్యూస్ చూసే ఏ కంపెనీ కూడా నీ సీవి ఎంత బాగున్నా తీసుకోదు. నీతి నియమం లేని జీవితం బూమరాంగ్‌లాగా నిన్ను ఏదో ఓ రోజున కాళ్ళ కింద నుంచి లాగేస్తుంది.

ఇట్లు

జాహ్నవి

ఉత్తరం చేతిలోంచి జారిపోయి, గాలికి రెండుసార్లు లేచి ఓ మూలగా కిటికీ కర్టెను దగ్గర వాలింది.

శరీరంలోని శక్తినంతా ఆ ఉత్తరంలోని అక్షరాలు లాగేశాయి. అలాగే నిస్సత్తువగా చాలాసేపు కూర్చుండిపోయి, గుర్తు వచ్చినట్లు లేచి, విస్కీ, సోడా గ్లాసు తెచ్చుకుని సోఫాలో కూచున్నాడు.

లైటార్పేశాడు. చేతిలో గ్లాసు. తోడుగా చీకటి – ఎన్నాళ్ళో ఇలా అని ప్రస్తుతానికి ఆలోచించదల్చుకోలేదు.

*రచన మాసపత్రిక, ఏప్రిల్ 2009*